

ఓ ఇంటి ముందు సంక్రాంతి ముగ్గు

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 సిద్దిపేట

మంగళవారం 14 జనవరి 2025

సంక్రాంతి సందడి

సిద్దిపేట జిల్లాలో సంక్రాంతి సందడి నెలకొంది. సోమవారం భోగి సందర్భంగా పలు చోట్ల భోగి మంటలు వేశారు. ఏడాదంతా సుఖసంతోషాలతో ఉండాలని, నవ ధాన్యాలు, సిరిసంపదలు కలగాలని కోరుకున్నారు. పిల్లలకు భోగి పండ్లు పోశారు. వాకిళ్లలో అందమైన రంగవల్లులు తీర్చిదిద్దారు. మరో పక్క మంగళవారం నాటి సంక్రాంతి కోసం జనం మార్కెట్లకు పరుగులు పెట్టారు. చిన్నారులు రంగురంగుల గాలిపటాలు కొనుగోలు చేయడం కనిపించింది. పిండి వంటలు చేసుకునేందుకు పిండి గిర్నీల వద్ద మహిళలు బారులు తీరారు. ముంగిళ్లలో ముగ్గులు వేయడానికి మహిళలు, యువతులు రంగులు కొనుగోలు చేశారు. రేగు పండ్లు, జీడి కాయలు, ఆవు పేడ, పువ్వులు తీసుకోవడంలో బిజీగా ఉన్నారు.

సిద్దిపేట కల్చరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి)



పతంగులు కొనుగోలు చేస్తున్న పిల్లలు, పెద్దలు



పూజా సామాగ్రి కొనుగోలు చేస్తున్న మహిళలు



ముగ్గుల కోసం రంగులు కొనుగోలు చేస్తూ..



భోగి మంట చుట్టూ నృత్యం చేస్తున్న మహిళలు



రంగులు విక్రయిస్తున్న వృద్ధురాలు



పూలు విక్రయిస్తున్న మహిళ



భోగి మంట చుట్టూ చేరి పాటలు పాడుతున్న మహిళలు

కొండపోచమ్మ జాతరకు అంకురార్పణ

ఆలయం వద్ద సదరు పటం

జగదేవ్‌పూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): జగదేవ్‌పూర్ మండలంలోని తిగుల్ నర్సాపూర్‌లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండపోచమ్మ అమ్మవారి జాతరకు అంకురార్పణ జరిగింది. సోమవారం అమ్మవారి ఆలయ ఆవరణలో సదరు పటం కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. జాతర ప్రారంభానికి ముందు భోగి పండుగ రోజున సదరుపటం వేయడం ఆనవాయితీగా వస్తుంది. బైండ్ల కులస్తులు ఆలయ ఆవరణలో వివిధ రంగులతో అందంగా సదరు పటం వేయగా, వంశపారంపర్యంగా వస్తున్న ఆలయ అర్చకులు పట్నాలు ఎక్కించారు. అనంతరం అమ్మవారికి నిర్వాహకులు ఘటం, బోనం తీశారు. డప్పు చప్పుళ్లు, శివసత్తుల సిగాలతో ఘటం, బోనం ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారికి మొదట సదరు పటం వేసిన తర్వాత భక్తులు ఎవరైనా ఈ పటాలు వేసుకోవచ్చు. అమ్మవారి జాతర జనవరి 20 నుంచి ప్రారంభమై ఉగాదితో ముగియనుంది. కొండపోచమ్మ ఆలయ మాజీ చైర్మన్ హన్మంతరెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ రజితరమేష్, తిగుల్ మాజీ సర్పంచ్ భానుప్రకాష్‌రావు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రవికుమార్, సిబ్బంది మహేందర్‌రెడ్డి, కనకయ్య, హరిబాబు, పూజారులు కృష్ణమూర్తి, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.



ఘటం, బోనం తీసుకుని వస్తున్న భక్తులు

ఇక.. భరోసా

రైతులకు.. కూలీలకూ..

తగ్గనున్న లబ్ధిదారులు

రేషన్ కార్డులకూ మోక్షం

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గుర్తింపు

రిపబ్లిక్ డే నుంచి అమలుకు కార్యాచరణ



సిద్దిపేట కలెక్టరేట్ జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో మరికొన్నింటిని అమలు చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు రైతుభరోసా పథకం, భూమిలేని రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, అర్హులైన పేదలకు రేషన్ కార్డులు, ఇల్లులేని పేదలకు ఇందిరమ్మ పథకం ద్వారా ఇల్లు మంజూరు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. పథకాల అమలను ఈ నెల 26న గణతంత్ర దినోత్సవం నాడు ప్రారంభించనున్నారు. అర్హులను ఎంపిక చేసేందుకు క్షేత్రస్థాయి పరిశీలన, గ్రామ సభలో జాబితా ప్రదర్శన అనంతరం లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. ఇందుకోసం ఈ నెల 16 నుంచి 20 వరకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తారు. 21 నుంచి 24 వరకు ప్రజాపాలన గ్రామసభలు నిర్వహిస్తారు. 25న జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ లబ్ధిదారుల జాబితాను ఆమోదిస్తారు. రిపబ్లిక్ డే రోజున పథకాలను ప్రారంభిస్తారు.

తగ్గనున్న రైతు భరోసా..

పంట పెట్టుబడి సాయంగా ఎకరాకు ఏడాదికి రూ. 12వేల చొప్పున అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకానికి శ్రీకారం చుట్టింది. గతేడాది జిల్లాలో 3,24,141 మంది రైతులకు రూ. 312.66 కోట్లు రైతుబంధు వచ్చింది. కొత్త నిబంధనలతో లబ్ధిదారుల సంఖ్య తగ్గవచ్చని తెలుస్తోంది..

60వేలకు పైగానే కొత్త రేషన్‌కార్డులు

కుటుంబ సర్వే ఆధారంగా రేషన్ కార్డులు జారీ చేయనున్నారు. రేషన్ కార్డులలో మార్పులు చేర్పులు చేసేందుకు జిల్లాలో దాదాపు 33వేలు పైగా దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయి. జిల్లాలో 2.91 లక్షల రేషన్ కార్డులు ఉండగా.. నూతన రేషన్ కార్డులు మంజూరు అయితే మరో 60 వేల పైగానే రేషన్ కార్డులో జిల్లాకు రానున్నాయి.

ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజాపాలనలో 2.30 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. 2.18 లక్షల ఇళ్ల సర్వే జరిగింది. అందులో అర్హులైన వారిని గుర్తిస్తున్నారు. లబ్ధిదారుల ఎంపిక జనవరి 26 నాటికి పూర్తి చేయాల్సి ఉంటుంది. తొలి విడతలో ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో 3500 ఇళ్లను మాత్రమే మంజూరు చేయనున్నారు.

భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు రెండు విడతలలో రూ.6 వేల చొప్పున సంవత్సరానికి రూ.12వేలు అందించే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని గణతంత్ర దినోత్సవం నాడు ప్రారంభించనున్నారు. జిల్లాలో 1.36 లక్షల జాబ్ కార్డులు ఉండగా.. అందులో 2.37 లక్షలమంది కూలీలు ఉన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో కనీసం 20 రోజులు ఉపాధి హామీ పనులు చేసిన భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబానికి ఈ పథకం వర్తిస్తుంది.



ఆర్టీసీకి సంక్రాంతి రద్దీ

అదనంగా ట్రిప్పులు

సిద్దిపేట అర్బన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ప్రయాణికుల రద్దీ పెరగడంతో సిద్దిపేట ఆర్టీసీ డిపో పరిధిలో, జిల్లా పరిధిలో ప్రయాణికులకు ఇబ్బంది జరగకుండా ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. సిద్దిపేట నుంచి ప్రధాన రూట్లు అయిన సికింద్రాబాద్, వేములవాడ, హుస్నాబాద్, మెదక్, కామారెడ్డి, కరీంనగర్ రూట్లలో అదనపు బస్సులు నడుపుతున్నారు. సిద్దిపేట డిపో నుంచి జేబీఎస్‌కు 25, వేములవాడకు 4, హనుమకొండకు 4, కామారెడ్డికి 4, మెదక్ 3 అదనపు ట్రిప్‌లను దుబ్బాక డిపో నుంచి జేబీఎస్‌కు 8 అదనపు ట్రిప్పులు నడుపుతున్నారు. సంక్రాంతి పండుగ తర్వాత కూడా నాలుగు రోజులపాటు అదనపు ట్రిప్పులు నడపున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. పండుగ సందర్భంగా ఆర్టీసీ బస్సులను వినియోగించుకోవాలని డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి కోరారు.



రహదారిపై ఒరిగిన ఆర్టీసీ బస్సు

తప్పిన ప్రమాదం

కోహెడ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బస్వాపూర్, లక్ష్మీపూర్ గ్రామాల మధ్య హనుమకొండ-సిద్దిపేట జాతీయ రహదారిపై పండుగ పూట సోమవారం పెనుప్రమాదం తప్పింది. ఎదురుగా వచ్చిన లారీని తప్పించబోయి ఆర్టీసీ బస్సు రోడ్డు కిందకి దూసుకెళ్లి పక్కకి ఒరిగిపోయింది. డ్రైవర్ వెంటనే బ్రేక్ వేయడంతో ప్రమాదం తప్పింది. ఆ సమయంలో బస్సులో సుమారు 20 మంది ప్రయాణికులు ఉన్నారు. బ్రిడ్జి వద్ద రోడ్డు పనులు కొనసాగుతున్న నేపథ్యంలో వన్‌వే చేశారు. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయిన ఆర్టీసీ బస్సు రోడ్డు కిందికి దూసుకెళ్లింది.



రంగనాయక సాగర్ రిజర్వాయర్‌లోని నీటి అంచున పర్యాటకులు

ప్రాణాలు పోతున్నా.. పరిహాసమేనా?

రిజర్వాయర్ల వద్ద పర్యవేక్షణ డొల్ల

నిఘా వ్యవస్థ లేనందునే ప్రమాదాలు

పనిచేయని సీసీ కెమెరాలు




రంగనాయకసాగర్ వద్ద పనిచేయని సీసీ కెమెరాలు

ఆంధ్రజ్యోతి, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 13 : విహారయాత్ర కోసమని కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్‌కు వచ్చి ఐదుగురు యువకులు గల్లంతై చనిపోయినప్పటికీ అధికార యంత్రాంగం కళ్లు తెరవడం లేదు. హైదరాబాద్‌కు చెందిన ఏడుగురు యువకులు శనివారం సిద్దిపేట జిల్లాలోని కొండపోచమ్మసాగర్‌లో ఈత కొడుతున్న క్రమంలో ఐదుగురు మృతిచెందిన విషయం తీవ్ర విషాదాన్ని నింపింది. ఇలాంటి సంఘటన జరిగాక అయినా రిజర్వాయర్లపై పర్యవేక్షించాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. కొండపోచమ్మసాగర్‌తో పాటు సిద్దిపేట జిల్లాలోనే ఉన్న రంగనాయకసాగర్ రిజర్వాయర్, సంగారెడ్డి జిల్లాలోని మంజీర రిజర్వాయర్‌లకు పర్యాటకుల తాకిడి క్రమంగా పెరుగుతోంది. కొండపోచమ్మసాగర్‌లో ఇప్పటివరకు 30 మంది దాకా ప్రాణాలు పోగొట్టుకున్నారు. రంగనాయకసాగర్‌లోనూ ఆ సంఖ్య పది దాటింది. సంగారెడ్డి జిల్లాలోని మంజీర, సింగూరు రిజర్వాయర్ల వద్ద పలువురు గల్లంతై మృత్యువాతపడ్డారు. ప్రమాదవశాత్తు నీళ్లలోపడి చనిపోవడం.. అధికారులు మొక్కుబడి హెచ్చరికలు చేయడం.. ఆ తర్వాత షరా మామూలే అన్నట్లుగా పరిస్థితులు దాపురిస్తున్నాయి.

పర్యవేక్షణ లేకుంటే అంతే సంగతి !

ఇప్పటికైనా రిజర్వాయర్ల వద్ద అధికార యంత్రాంగం పర్యవేక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పటివరకు జరిగిన ప్రమాదాలు ఆత్మహత్యలు అన్నీ కూడా నిఘా వైఫల్యం వల్లనే జరిగాయనే అభిప్రాయాలు నెలకొన్నాయి. విహారం కోసం వస్తున్న పర్యాటకులకు విషాదం కలిగేలా ఈ రిజర్వాయర్ల వద్ద పరిస్థితులు గోచరిస్తున్నాయి. నిత్యం రిజర్వాయర్ల వద్ద భద్రతా సిబ్బందితో పర్యవేక్షణ కనబర్చాలి. సంబంధిత అధికారులు కూడా దిద్దుబాటు చర్యలు చేపట్టాలి. క్రమం తప్పకుండా పెట్రోలింగ్ వ్యవస్థను అమలు చేయాలి. సీసీ కెమెరాలను అమర్చాలి.



సంగారెడ్డిలోని మంజీరా డ్యామ్ వద్ద యువకుల జలకాలాటలు

వేల కోట్ల ఖర్చు.. సీసీ కెమెరాలు కరువు

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా వేల కోట్లతో నిర్మించిన రంగనాయకసాగర్, కొండపోచమ్మసాగర్, మల్లన్నసాగర్ రిజర్వాయర్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయకపోవడం విడ్డూరంగా మారింది. గతంలో పలు కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ పర్యవేక్షణ లేక మూలన పడ్డాయి. కొన్ని చోట్ల స్తంభాలకు వేలాడుతూ నేల చూపులు చూస్తున్నాయి. కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తూ పర్యాటకులకు హెచ్చరికలు చేస్తుంటే ఈ ప్రమాదాలు జరిగేవి కావనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇటు పోలీసులు, అటు నీటిపారుదల శాఖ అధికారులు కూడా నిఘా వ్యవస్థను

మిగతా 6వ పేజీలో



పండుగల పరమార్థం.. ఆరోగ్యం

సంప్రదాయాల పాటింపుతో మేలు

పిండివంటల్లో మెండుగా పోషకాలు

6

ఆర్మీ జవాన్ల ఇలాకా

రేపు ఆర్మీ డే

కట్కూరంతా సైనికులే

నాడు పీపుల్స్‌వార్ ఖిల్లా

నేడు దేశ రక్షణలో గ్రామ యువకులు

అనాజీపూర్ నుంచి మామా అల్లుళ్లు

7









ప్రాణాలు పోతున్నా.. పరిహాసమేనా?

5వ పేజీ తరువాయి


కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ వద్ద హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసిన పోలీసులు

విస్మరిస్తున్నారు. ఇన్నాళ్లు కొండపోచమ్మసాగర్ వద్ద కంటికి కనపడని పోలీసులు, నీటిపారుదల శాఖ ఉద్యోగులు ఆదివారం రోజున చక్కర్లు కొట్టడం కనిపించింది. అయినప్పటికీ కొందరు రిజర్వాయర్లోకి అడ్డదారుల్లో వెళ్లేందుకు ప్రయత్నాలు చేశారు. ఇక రంగనాయకసాగర్ వద్ద నీటి అంచునే పర్యాటకులు సేద తీరుతున్నా వారించేవారు లేకపోవడం గమనార్హం. ఇదే రంగనాయకసాగర్ వద్ద సెల్ఫీలు తీసుకుంటూ, సేద తీరుతూ చనిపోయినవాళ్లు లేకపోలేదు. అయినప్పటికీ చర్యలు లేవు.

ప్రాజెక్టుల వద్ద బోర్డులు

సిద్దిపేట క్రైం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కొండపోచమ్మసాగర్, మల్లన్నసాగర్, రంగనాయకసాగర్, అంతగిరి ప్రాజెక్టుతో పాటు పెద్దచెరువుల వద్ద పెట్రోలింగ్, బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సిద్దిపేట సీపీ డాక్టర్ బి.అనురాధ తెలిపారు. సరదా కోసం చెరువులు, బావులకు వాగులు వంకలలో ఈతకు వెళ్లే పిల్లల విషయంలో తల్లిదండ్రులు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రత్యేకంగా పండుగ దినాలు, సెలవు రోజుల్లో ప్రాజెక్టులు, పెద్దపెద్ద చెరువుల వద్ద పెట్రోలింగ్, బ్లూ కోల్ట్ సిబ్బందిని నియమిస్తామని తెలిపారు. ప్రతీ శనివారం, ఆదివారం పోలీస్ పెట్రోలింగ్‌ను ముమ్మరం చేస్తామని పేర్కొన్నారు. ప్రాజెక్టుల వద్ద హెచ్చరిక బోర్డులు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేశామని తెలిపారు.

పండుగల పరమార్థం.. ఆరోగ్యం

- సంప్రదాయాల పాటింపుతో మేలు
- పిండివంటల్లో మెండుగా పోషకాలు



సిద్దిపేట కల్చరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సంబురం రానే వచ్చింది. పల్లె పండుగల వెనుక అనేక ఆరోగ్య ప్రయోజనాలు, సంప్రదాయాల పాటింపులో సైన్స్ దాగి ఉంది. సాధారణంగా సంక్రాంతి జనవరి మాసంలో వస్తుంది. ఈ మాసంలో విపరీతమైన చలి ఉంటుంది. వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది. ఇలాంటి సందర్భంలో సంక్రాంతి పండుగ రోజున ఆనవాయితీగా చేసే ప్రతి పని మేలు చేసేదే.

పిండివంటలతో పోషకాలు

సంక్రాంతికి పండుగకు పిండివంటలు ప్రత్యేకం. సకినాలు, గారెలు, నువ్వుల ముద్దలు, సున్నుండలు, అరిసెలు వంటివి చేస్తారు. ఇందులో వాడే పదార్థాలతో శరీరానికి కావాల్సిన పోషకాలు పుష్కలంగా అందుతాయంటున్నారు వైద్యులు. తెలంగాణలో ఎక్కువగా చేసుకునే సంక్రాంతి ప్రత్యేక పిండివంటకం సకినాలు. బియ్యం నానబెట్టి ఆరబెట్టిన తర్వాత పిండిచేసి, అందులో నువ్వులు, వాము వేసి గుండ్రంగా పోసి నూనెల వెయించి సకినాలు తయారు చేస్తారు. దాదాపు నెలరోజుల వరకు నిల్వ ఉండే సకినాలు చాలా మంది ఇష్టంగా తీసుకుంటారు. ఇందులో వాడే నువ్వులు శరీరంలో ఉష్ణోగ్రతను పెంచుతుంది. వాముతో జలుబు, దగ్గు వంటి సమస్యలు దూరమవుతాయి. సకినాల తర్వాత అంతే ఎక్కువగా చేసుకునే మరో వంటకం మురుకులు. దీన్ని పలుచోట్ల పలు రకాలుగా పిలుస్తారు. మడుగులు, జంతికలు, పూస, శిబ్బులని అంటారు. స్నాక్స్‌లో ఎక్కువగా తింటారు. బియ్యం పిండితో పాటుగా శనగపిండి, ఉప్పు కారం వేసి చేస్తారు. శనగపిండిలో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. దీంతో జీర్ణక్రియకు మేలు చేస్తుంది. నువ్వులు, బెల్లం కలిపి చేసే నువ్వుల ముద్దలు భలే రుచిగా ఉంటాయి. నువ్వులతో ప్రొటీన్స్, విటమిన్‌లు శరీరానికి లభిస్తాయి. బెల్లంతో ఐరెన్ అందుతుంది. రక్త హీనతతో ఇబ్బంది పడేవారికి ఇది ఔషధంలా పనిచేస్తుంది. మరికొన్ని మినుములతో సున్నండలు చేస్తుంటారు. మినపప్పుతో శరీరానికి కావాల్సిన పోషకాలు సమృద్ధిగా లభిస్తాయి. సంక్రాంతి వేళ అందరి ఇళ్లల్లో చేసే అరిసెలలో ఐరన్‌తో పాటుగా కార్బోహైడ్రేట్స్ పుష్కలంగా లభిస్తాయి. సంప్రదాయ వంటలను పిల్లలకు అందించాలని నిపుణులు సూచిస్తున్నారు.

సమష్టి జీవన ప్రతీక

సమష్టి జీవనానికి ప్రతీకగా పిండివంటల తయారీని చూడవచ్చు. పండుగ పిండి వంటలు తయారు చేయటం ఒక్కరి వల్ల సాధ్యం కాదు. పక్కింటి వాళ్లు, బంధువులు ఓచేయి కలిపితేనే త్వరగా పూర్తవుతాయి. ఒకరోజు ఎదురింట్లో, మరో రోజు పక్కింట్లో ముచ్చట్లు చెప్పుకుంటూ అందరూ కలిసి పిండి వంటలు తయారు చేస్తుంటారు. చేసిన వంటలను రుచి చూడమని పరస్పరం పంచుకుంటారు. కష్టసుఖాల్లో కలిసి ఉండాలని తెలియకనే చాటిచెబుతారు. భోగి పండుగ రోజు వేసుకునే భోగి మంటల్లో ఆవుపేడతో చేసిన పిడకలను వాడుతారు. దీంతో గాలిలో ఉన్న సూక్ష్మక్రిములు నశిస్తాయి. ఇంటి ముందు వేసే ముగ్గుల్లో వాడే కుంకుమ, పసుపుతో పాటుగా ఆవుపేడతో చేసిన గొబ్బెమ్మలను పెడతారు. దీంతో ఇంట్లోకి సూక్ష్మక్రిములు ప్రవేశించకుండా ఉంటాయి. రైతు జీవితంలో మమేకమయ్యే పశువులను కనుమ రోజు పూజించుకోవటం ఆనవాయితీగా వస్తుంది. మనకు అవసరమయ్యే, మేలు చేసే వాటి గురించి ఎలాంటి సాంకేతికత లేని రోజుల్లోనే మన పూర్వీకులు పాటించారు. వాటినే సంప్రదాయాల పేరిట మనకు అందించారు. వాటిని నేటికి పాటిస్తూ ఆరోగ్య ప్రయోజనాలను అంతర్లీనంగా పొందుతున్నాం.

స్కూటీని ఢీకొన్న కారు, ఒకరి మృతి


బొందయ్య(ఫైల్)

కౌడిపల్లి, జనవరి (ఆంధ్రజ్యోతి) 13 : స్కూటీని కారు ఢీకొన్న ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సంఘటన మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. మెదక్ గోల్కొండ ప్రాంతానికి చెందిన కాసపురం బొందయ్య(62) కౌడిపల్లి మండల పరిధిలోని కంచనపల్లిలో భజన కార్యక్రమం ఉండడంతో స్కూటీపై వెళ్తున్నాడు. మెదక్ నుంచి వస్తున్న కారు స్కూటీని ఢీకొనడంతో కారు కిందపడిన బొందయ్య తలకు తీవ్రగాయాలై కారు కింద చిక్కుకున్నాడు. స్థానికులు గమనించి కారును పైకి లేపి బొందయ్యను నర్సాపూర్ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎస్ఐ రంజిత్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దొంగతనానికి పాల్పడ్డ ఇద్దరికి రిమాండ్

కొల్చారం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : కొల్చారం రేణకాఎల్లమ్మ ఆలయంలో ఈనెల 10న రాత్రి దొంగతనానికి పాల్పడ్డ ఇద్దరు నిందితులను సోమవారం పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు మహ్మద్ గౌస్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మెదక్ పట్టణానికి చెందిన దూదేకుల అఫ్సర్, ప్రవీణ్ రేణుకాఎల్లమ్మ ఆలయంలో బంగారం ముక్కుపుడకతో పాటు నగదు, ఇతర వస్తువులు దొంగిలించినట్లు సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు.

కమనీయం... కల్యాణం



మెదక్ కోదండ రామాలయంలో కల్యాణ తంతు నిర్వహిస్తున్న వేదపండితులు

మెదక్ అర్బన్, జనవరి13(ఆంధ్రజ్యోతి): ధనుర్మాసోత్సవాల్లో భాగంగా భోగి పండుగ సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని శ్రీ కోదండ రామాలయంలో శ్రీ గోదారంగనాథుల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు బాష్యం మధుసూదన్‌చార్యులు, వేద పండితుల వేదమంత్రాల నడుమ వైభవంగా జరిగిన ఈ కల్యాణానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దాంతో ఆలయ ప్రాంగణం గోవింద నామస్మరణతో మార్మోగింది. అనంతరం అన్నదానం కార్యక్రమం చేపట్టారు. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు దేవేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, కౌన్సిలర్ ఆర్కే శ్రీను, వేద పండితులు కర్ని ప్రభాకర్ శర్మ , నారాయణ చార్యులు, ప్రసాద్‌శర్మ, కృష్ణమూర్తి, రంగాచార్యులు, వైద్య శ్రీనివాస్‌శర్మ, లింగమూర్తిశర్మ, కృష్ణారావుశర్మ, శ్రీనివాస్ చారి, ఆలయ కమిటీ చైర్మన్ బండ నరేందర్, సభ్యులు పాల్గొన్నారు.



సంగారెడ్డి వైకుంఠపురం ఆలయంలో కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

సంగారెడ్డి అర్బన్, జనవరి 13(ఆంధ్రజ్యోతి) : ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా సంగారెడ్డి శివారులోని శ్రీవైకుంఠపురం ఆలయంలో సోమవారం గోదారంగనాథస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కందాడై వరదాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణోత్సవాన్ని వైభవంగా జరిపించారు. జై శ్రీమన్నారాయణ, జైజై శ్రీమన్నారాయణ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. కాగా, కల్యాణోత్సవాన్ని వీక్షించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఇలా ఉండగా 14న ఏకాంతసేవ(ఊంజల్ సేవ), 15న సర్వమంగళా దేవీ ఆవిర్భావంతో కార్యక్రమాలు ముగుస్తాయని ఆలయ ప్రధాన అర్చకుడు కందాడై వరదాచార్యులు తెలిపారు. అనంతరం లడ్డూ వేలం పాట నిర్వహించగా, సంగారెడ్డికి చెందిన ధర్మపురి ఫౌండేషన్ అధినేత ధర్మపురి ప్రవీణ్‌కుమార్ రూ.2,77,777లకు దక్కించుకున్నారు.



వర్గల్ నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో ..

వర్గల్, జనవరి 13 ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అత్యంత ప్రసిద్ధిగాంచిన వర్గల్ మండల నాచారం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో ధనుర్మాసోత్సవాలలో కీలక ఘట్టమైన శ్రీ గోదాదేవి రంగనాథస్వామి కల్యాణం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలను తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి విశ్వనాథ శర్మ నేతృత్వంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సుధాకర్, పాండు, నరేందర్ పాల్గొన్నారు. అలాగే వర్గల్ మండల కేంద్రంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో గోదాదేవిరంగనాథ స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ వేద పండితులు వేదాంతం మురళీధర చార్యుల నేతృత్వంలో వేడుకలను నిర్వహించారు.

క్రైం కార్నర్

ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం

● రూ. 3కోట్ల ఆస్తి నష్టం



ఫ్యాక్టరీలో దగ్ధమైన యంత్రాలు

వెల్దుర్తి, జనవరి13(ఆంధ్రజ్యోతి) : షార్ట్ సర్క్యూట్‌తో ఓ ప్యాక్టరీలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని కుకునూర్ గ్రామ సమీపంలోని సాయి సంతోషి రేణుక ఇండస్ట్రీలో ఆదివారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ మంటలు చెలరేగాయి. దీంతో ప్యాక్టరీలో ఉన్న యంత్ర పరికరాలు, యంత్ర సామగ్రితో పాటు రెండు ద్విచక్ర వాహనాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ప్యాక్టరీ పూర్తి దగ్ధం కావడంతో సుమారు రూ. 3కోట్ల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు.

బృందావన్ హోటల్‌లో..

● రూ.10 లక్షల వరకు ఆస్తి నష్టం



సిద్దిపేట క్రైం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణంలోని స్థానిక ఇంటిగ్రేటెడ్ మార్కెట్ వద్ద ఉన్న బృందావన్ హోటల్‌లో అగ్ని ప్రమాదం సంభవించింది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో హోటల్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన సెక్యూరిటీ గార్డ్ వెంటనే ఫైర్ అధికారులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న ఫైర్ అధికారులు, సిబ్బంది మంటలను ఆర్పి వేశారు. అప్పటికే హోటల్లో ఉన్న సామగ్రి దగ్ధమైంది. సుమారు పది లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేశారు.

16 గొర్రెలు మృత్యువాత

మద్దూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లద్నూరులో సోమవారం తెల్లవారుజామున గొర్రెల మందపై హైనాలు దాడులు చేశాయి. ఈ మేరకు సందెబోయిన రామచంద్రంకు చెందిన 16 గొర్రెలు మృత్యువాత పడగా, మరో 12 తీవ్రంగా గాయపడ్డాయి. రూ.2 లక్షలపైనే నష్టపోయినట్లు బాధితుడు బోరున విలపించారు. ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ జేకే మూర్తి మృతి చెందిన గొర్రెలను పరిశీలించి పంచనామా నిర్వహించారు. నష్ట పరిహారం కోసం ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు.



మృతి చెందిన గొర్రెలను పరిశీలిస్తున్న ఫారెస్ట్ అధికారి

మైసూర్‌లో స్వామి వివేకానంద జయంతి

● హాజరైన కూన వేణుగోపాలకృష్ణ

సంగారెడ్డి రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : మైసూర్ మహారాజు ఆహ్వానం మేరకు స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల్లో యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు కూన వేణుగోపాల కృష్ణ పాల్గొన్నారు. మైసూర్ మహారాజు యాదువీర్ కృష్ణ దత్తు చమరాజా వడ్డీఆర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ఆయన హాజరై ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రం నుంచి మైసూర్ మహారాజు ప్రత్యేక గౌరవాన్నందించి వేదికపై ప్రతిష్ఠాత్మకమైన స్వామి వివేకానంద ప్రతిమ పురస్కార జ్ఞాపికను అందించడం సంతోషంగా ఉందన్నారు. ఇక నుంచి సామాజిక సేవా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు.



మాట్లాడుతున్న కూన వేణుగోపాల కృష్ణ



సరిహద్దుల్లో కట్కూరు జవాన్లు

రేపు ఆర్మీ డే

ప్రస్తుతం 130 మంది సైనికులు

దేశ రక్షణ కోసం అవసరమైతే ప్రాణాలు వదలాల్సి వస్తుందని తెలిసినా ఆగ్రామ యువత తమ ప్రాణాల కంటే దేశరక్షణకే కదం తొక్కుతున్నారు. రాష్ట్రంలో ఎక్కడ ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ జరిగినా ఈ గ్రామ యువత పోటీ పడాల్సిందే. ఈ ఊర్లో 900 కుటుంబాలు, 3500 జనాభా, వీరిలో 170 మంది వరకు ఆర్మీ ఉద్యోగులు కాగా, వీరిలో 40 మంది విరమణ పొందారు. ప్రస్తుతం ఇంకా 130 మంది సరిహద్దుల్లో రక్షణ విధుల్లో పాలుపంచుకుంటున్నారు.

ఆర్మీ జవాన్ల ఇలాకా

● కట్కూరంతా సైనికులే

● నాడు పీపుల్స్‌వార్ ఖిల్లా

● నేడు దేశ రక్షణలో గ్రామ యువకులు

అక్కన్నపేట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): దేశ సరిహద్దులో ఎక్కడ తూట పేలిన ఇక్కడి కుటుంబాల్లో గుండెలు గుబేలుమంటాయి. దేశ రక్షణ కోసం సరిహద్దులో తుపాకి పట్టిన కుమారుడిని చూసి గర్వపడాలో.. ఏదైనా జరగరానిది జరిగితే ఎలా అని కుమిలిపోవాలో అర్థం కాని పరిస్థితి ఆ కుటుంబాలది. అవసరమైతే ప్రాణాలు వదలాల్సి వస్తుందని తెలిసినా దేశ రక్షణలో భాగస్వాములం కావాలన్న ఈ గ్రామ యువత ఆశయం ఎంతో గొప్పది. ఆ గ్రామమే సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలోని కట్కూరు గ్రామం.

నాడు భూమి కోసం, భుక్తి కోసం భూస్వాములు, పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా పీపుల్స్‌వార్‌లో చేరి ప్రజలకు బాసటగా పోరాటాలు చేసిన ఆ గ్రామ యువకులు నేడు దేశరక్షణ కోసం ఆర్మీలో చేరి సరిహద్దుల్లో కాపలా కాస్తున్నారు. ఒక్కరు కాదు ఇద్దరు కాదు వంద మందికి పైగా జవాన్లు సరిహద్దుల్లో తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా విధులు నిర్వహిస్తున్నారు. ఉగ్రవాదుల దాడిలో తమ గ్రామానికి చెందిన ఒక జవాన్ వీరమరణం పొందినా, వారిలో పట్టు సడలలేదు. ఆ జవాన్ చనిపోయిన తర్వాత మరో 25 మంది సైన్యంలో చేరి తమ దేశ భక్తిని చాటుకున్నారు ఈ గ్రామ యువకులు.

అతడే ఆదర్శం...

కట్కూరు నుంచి 40 ఏళ్ల క్రితమే జెర్రిపోతుల డేనియల్ మిలిటరీలో జవాన్‌గా చేరాడు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ఎంతోమంది యువకులు నేడు దేశ రక్షణలో భాగస్వాములవుతున్నారు. దేశభక్తి, దేశానికి సేవ చేయాలనే తపనతో వారు మిలటరీ వైపు అడుగులు వేశారు. పదో తరగతి ఉత్తీర్ణులైన యువకులు తెలంగాణలో ఏ ప్రాంతంలో ఆర్మీ సెలెక్షన్స్ జరిగినా ఎంపికకు హాజరవుతున్నారు. ఒకసారి ఎంపికలో విఫలమైనా రెండు, మూడు పర్యాయాలు పాల్గొని విజయం సాధించి ఆర్మీలో చేరుతున్నారు. పెద్ద ఎత్తున గ్రామ యువకులు దేశసేవలో పాలు పంచుకుంటున్నారు. గజ గజ వణికించే చలి, ఎముకలు కొరికే మంచు, ఎండకు ఎండుతూ వానకు నానుతూ దేశ సేవ చేస్తున్నారు. తీవ్రవాదులతో ఎన్నోసార్లు పోరాడినవారు ఉన్నారు. ఆర్మీలో రిక్రూట్ అయిన వారు జవాన్, లాంచ్‌నాయక్, నాయక్, హవల్దార్, నాయక్ సుబేదార్ పోస్టుల వరకు పని చేస్తున్నారు.

మామా అల్లుళ్లు

రాయపోల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : సాధారణంగా ఆర్మీలోకి పిల్లలను పంపించాలంటే తల్లిదండ్రులు వెనుకంజ వేస్తారు. గ్రామీణ ప్రాంతాల్లోనైతే అసలే ఒప్పుకోరు. అలాంటిది ఒకే కుటుంబం నుంచి మామా, ఇద్దరు అల్లుళ్లు ముగ్గురూ సైన్యంలో చేరి దేశ సేవలో పాలుపంచుకుంటున్నారు. మామ సుమారు 20 ఏళ్లు సైన్యంలో పనిచేసి రిటైర్‌కాగా అల్లుళ్లిద్దరూ ఆర్మీలో కొనసాగుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలంలోని అనాజీపూర్ గ్రామానికి చెందిన నీల చంద్రం ఇరువై ఏళ్ల క్రితం ఆర్మీలో చేరి దేశ రక్షణలో భాగస్వాములయ్యారు. వివిధ బార్డర్‌ల వద్ద విధులు నిర్వహించి ఇటీవలనే రిటైర్ అయ్యాడు. మేనమామను స్ఫూర్తిగా తీసుకున్న ఆయన ఇద్దరు అల్లుళ్లు మంతూరు గ్రామానికి చెందిన పడిగె జమున - నర్సింహులు కొడుకులు ఆంజనేయులు, నందీశ్వర్ అతడి ప్రోత్సాహంతో ఆర్మీని ఎంచుకున్నారు. ఇద్దరూ 2018లో సెలక్ట్ అయి సేవలందిస్తున్నారు. పడిగే ఆంజనేయులు ప్రస్తుతం రాజస్థాన్ రాష్ట్రం జసల్మేర్‌లోని మద్రాస్ ఇంజనీర్ రెజ్మెంట్‌లో పనిచేస్తున్నారు. ఇంతకుముందు ఢిల్లీ, జమ్మూకాశ్మీర్‌లో పనిచేశాడు. పడిగే నందీశ్వర్ కూడా మద్రాస్ ఇంజనీర్ రెజిమెంట్లో సోల్జర్ టెక్నికల్‌గా సేవలందించారు. ప్రస్తుతం జమ్మూకాశ్మీర్ రాష్ట్రం బారాముల్లా జిల్లాలో యాంటీ టెర్రరిస్ట్ ఆపరేషన్ రెజిమెంట్ రాష్ట్రీయ రైఫిల్స్‌లో పని చేస్తున్నారు. ఇంతకుముందు సిక్కిం, పశ్చిమ బెంగాల్‌లో పనిచేశారు.



మామ నీల చంద్రం, అల్లుళ్లు ఆంజనేయులు, నందీశ్వర్

రిటైర్ అయినా దేశ సేవ కోసం తాపత్రయం

నీల చంద్రం ఆర్మీ నుంచి ఇటీవలే రిటైర్ అయ్యాడు. కానీ యువకులను ప్రోత్సహించి ఆర్మీలోకి పంపించాలని తీవ్రంగా కృషి చేస్తున్నాడు. ఇందులో భాగంగానే గజ్వేల్‌లో ఆజాద్ డిఫెన్స్ అకాడమీ నెలకొల్పి ఇప్పటివరకు 35 మందిని ఆర్మీ, నేవీలోకి పంపించాడు.

పోలీస్ అధికారులతో అవగాహన

గ్రామాలు, విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి యువకులు ఆర్మీలోకి వెళ్లే విధంగా ప్రోత్సహిస్తున్నాడు. రాయపోల్ మండలం ఎల్కల్ గ్రామంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో తొగుట సీఐ లతీఫ్ పాల్గొని యువకులకు అవగాహన కల్పించారు.

పండుగకు 40 మంది పైగా జవాన్లు రాక..

దేశంలోని వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న జవాన్లు దసరా, సంక్రాతికి సందర్భంగా కుటుంబ సభ్యులను కలిసేందుకు వస్తారు. 40మందికి పైగా వచ్చి దాదాపు నెల రోజుల ఉండి వెళ్తుంటారు. వారు వచ్చినపుడు ఇక్కడి యువతలో దేశంపై ప్రేమను, ఐక్యతను చాటే ప్రయత్నం చేస్తారు. ఆర్మీలో చేరి దేశ రక్షణలో పాలుపంచుకోవాలన్న స్ఫూర్తిని కలిగిస్తారు.

రోడ్డు పనులకు నిధులు

● సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం

కోహెడ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : కోహెడ, మండలం తంగళ్లపల్లి గ్రామంలో ఈనెల 29 న జరిగే శ్రీ ప్రతాపరుద్ర సింగరాయ లక్ష్మీనరసింహస్వామి జాతర రహదారి తాత్కాలిక నిర్మాణ పనులకు ప్రభుత్వం రెండు లక్షల రూపాయలు నిధులు మంజూరు చేసింది. సోమవారం తాత్కాలిక రోడ్డు నిర్మాణ పనులకు కాంగ్రెస్ నాయకులు శ్రీకారం చుట్టారు. రూ. 10 లక్షలు మొరం పోయుటకు వెచ్చించి పనులు పూర్తి చేయనున్నారు. గతంలో ప్రతి సంవత్సరం తంగళ్లపల్లి నుంచి జాతర వరకు వర్షాకాలంలో వరదల వల్ల రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో ఏటా సర్పంచ్, దాతల సహకారంతో రోడ్డు మరమ్మతులు చేసేవారు. సింగరాయ జాతర పట్ల స్థానిక మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక దృష్టి సారించి మట్టి రోడ్డు నిర్మాణం చేపట్టడం కోసం రూ.10 లక్షల నిధులు మంజూరు చేయించడంపై నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటానికి క్షీరాభిసేకం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాము శ్రీకాంత్, రాజు తదితరులు ఉన్నారు.

వైన్స్‌లో దొంగతనం

● రూ.60 వేల చోరీ

రామచంద్రాపురం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : తెల్లాపూర్ మున్సిపాలిటీలోని ఎం.ఎం వైన్ షాపులో సోమవారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి రూ. 60వేలు, కొన్ని మద్యం బాటిళ్లు ఎత్తుకెళ్లారు. కొల్లూరు సీఐ రవీందర్ కథనం ప్రకారం రేడియల్ రోడ్డు 30 కు ఆనుకుని ఎంఎం వైన్ షాపును ఓ కంటైనర్‌లో ఏర్పాటు చేశారు. అక్కడ ఓ వాచ్‌మెన్‌ను కూడా నియమించారు. వాచ్‌మెన్ నిద్రకు ఉపక్రమించడంతో వెనుక నుంచి రంధ్రం చేసి అందులోంచి చొరబడ్డారు. గల్లాపెట్టేలోని రూ.60వేలు, అందిన కాడికి ఫుల్‌బాటిళ్లు, బీరుబాటిళ్లు ఎత్తుకెళ్లారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పాతపంటల జాతరకు వేళాయే

● నేటి నుంచి ఫిబ్రవరి 11 వరకు నిర్వహణ

● పాతికేళ్లుగా డీడీఎస్ ఆధ్వర్యంలో కార్యక్రమం

● పల్లెల లోగిళ్లలో ఎడ్లబండ్లతో ప్రదర్శన



పాతపంటల జాతరలో ఎడ్లబండ్ల ప్రదర్శన (ఫైల్)

జహీరాబాద్, జనవరి 13(ఆంధ్రజ్యోతి) : నిరుపేద మహిళా రైతులను సంఘటితం చేస్తూ జీవవైవిధ్య పంటలకు సాగుకు సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని డీడీఎస్(డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ) 25 ఏళ్లుగా కృషి చేస్తుంది. గ్రామగ్రామాన మహిళా రైతులను జాగృతం చేస్తూ మేమున్నామంటూ పాతపంటల సాగుకు ప్రోత్సహిస్తున్నది. మొదట ఐదారు గ్రామాలకు చెందిన 50మంది మహిళా రైతులతో ప్రారంభమైన డీడీఎస్ కార్యకలాపాలు నేడు జహీరాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా విస్తరించాయి. ప్రస్తుతం 50 గ్రామాల్లో 2500 మంది మహిళా రైతులతో 1500ఎకరాల్లో చిరుధాన్యాలను సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. వారంతా చిరుధాన్యాల చెల్లెళ్ల సమాఖ్యగా ఏర్పడి సంఘటితంగా ముందుకెళ్తున్నారు. దేశవిదేశాల్లో నిర్వహించే సదస్సుల్లో పాల్గొని చిరుధాన్యాల ఆహారంతో కలిగే ప్రయోజనాలను చాటిచెబుతున్నారు. మరో వైపు క్షేత్రస్థాయిలో మహిళా రైతులతో కలిసి పాత పంటలపై రైతులను చైతన్యపర్చుతున్నారు. గ్రామాల్లో ఎడ్లబండ్లతో ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. విత్తన సంపదను సృష్టిస్తూ ఆసక్తిగల రైతులకు అరువుగా ఇస్తున్నారు. డీడీఎస్ ఆధ్వర్యంలో మనజాతి వంగడాలను కాపాడుతూ విత్తన లక్ష్మిని రక్షిస్తూ డీడీఎస్ మహిళలు చేపట్టే పాతపంటల 25వ జాతరను నిర్వహించేందుకు డీడీఎస్ సిద్ధమైంది.

జాతరకు సర్వం సిద్ధం

డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ ఏడాది పాతపంటల జాతరను నిర్వహించేందుకు డీడీఎస్ మహిళా రైతులు సన్నద్ధమయ్యారు. అందరూ సంక్రాంతి పండుగను జరుపుకుంటే వారు చిరుధాన్యాలను సంరక్షించుకోవాలంటూ గ్రామాల్లో ఎండ్ల బండ్లతో జాతర ప్రదర్శనలను నిర్వహిస్తుంటారు. ఏటా జనవరి 14 నుంచి ప్రారంభమయ్యే జాతర నెలరోజులపాటు కొనసాగుతుంది. 10 ఎడ్లబండ్లతో 25 గ్రామాల్లో 2వేల పైచిలుకు మంది రైతులు ఇందులో పాల్గొంటారు. ఎడ్లబండ్లను వివిధ రకాల చిరుధాన్యాలు, చెరకుగడలు, మామిడితోరణాలతో అలంకరించి విన్నూత్న తరహాలో ప్రదర్శనలు చేస్తారు. ఈ ఏడాది పాతపంటల జాతరను నేటి నుంచి ఫిబ్రవరి 11 వరకు 25గ్రామాల్లో నిర్వహించనున్నారు. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు పూర్తి చేశారు. 14న న్యాల్‌కల్ మండలంలోని వడ్డీ గ్రామంలో ప్రారంభమై ఫిబ్రవరి 11న మాచ్నూర్‌లో ముగుస్తుందని, ఆయా గ్రామాల్లో చేపట్టే జాతరకు ప్రముఖులు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.



డీడీఎస్ మహిళారైతుల సాంస్కృతిక కార్యక్రమాలు(ఫైల్)



డీడీఎస్‌లో పాత పంటజాతర సందర్భంగా బోగి మంటలు

పాతపంటలతోనే సుస్థిర వ్యవసాయం..

పాతపంటలతోనే సుస్థిర వ్యవసాయం సాధ్యమవుతుందని డీడీఎస్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ దివ్య అన్నారు. సోమవారం డీడీఎస్ ఆవరణలో బోగి మంటల కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టే జాతర అందరిని ఆకట్టుబోతుందన్నారు. మన తిండి, సంప్రదాయం, ఆరోగ్యానికి చిరుధాన్యాలతో అనుసంధానం ఉంటుందన్నారు. నియోజకవర్గంలోని న్యాల్‌కల్, కోహీర్, ఝరాసంగం, మొగుడంపల్లి, జహీరాబాద్ మండలాల్లో ఈ జాతరను నిర్వహిస్తున్నట్లు వివరించారు. రైతులు, గ్రామస్థులు, నాయకులు, ప్రముఖులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో డీడీఎస్ సభ్యులు, మహిళా రైతులు, తదితరులు పాల్గొన్నారు.

- ఈ నెల 20 నుంచి కొండపోచమ్మ జాతర ప్రారంభం
- 3 నెలలపాటు కొనసాగనున్న ఉత్సవాలు
- ఏటా ఆదాయం రూ.50 లక్షల నుంచి రూ.80 లక్షల వరకు
- అయినా అభివృద్ధికి దూరం
- లక్షలాది మంది భక్తులు సందర్శిస్తున్నా కనీస సౌకర్యాలకు నోచుకోని వైనం
- టాయిలెట్స్ లేక మహిళలకు ఇబ్బందులు
- పదేళ్లుగా పూర్తిస్థాయి పాలకమండలికి నోచుకోని ఆలయం

ముంచుకొస్తున్న జాతర..
కనిపించని ఏర్పాట్లు

కొండపోచమ్మ ఆలయ అభివృద్ధి హామీలకే పరిమితం.. ఆచరణలో శూన్యం


కొండపోచమ్మ ఆలయం వద్ద భక్తుల సందడి

జగదేవ్‌పూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాంతంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ కొండపోచమ్మ ఆలయం అభివృద్ధికి నోచుకోవడం లేదు. రాష్ట్రంలో ఆలయాలకు ప్రభుత్వం రూ.కోట్ల నిధులు కేటాయించిన కొండపోచమ్మ అభివృద్ధిపై చిన్నచూపెందుకని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కొమురవెల్లి మల్లన్నను దర్శించుకున్న భక్తులందరూ కొండపోచమ్మను దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. అయితే కొమురవెల్లి మల్లన్న క్షేత్రంలో చేస్తున్న అభివృద్ధిలో కొంతవరకైనా కొండపోచమ్మ క్షేత్రంలో కనిపించడం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అమలుకు నోచని హామీలు

కొండపోచమ్మ జాతర ఉత్సవాలు ఏటా సంక్రాంతి నుంచి ప్రారంభమై ఉగాది వరకు దాదాపు మూడు నెలల పాటు కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల సందర్భంగా భక్తులు ఏటా రాష్ట్ర నలుమూలాల నుంచి పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు కనీస సౌకర్యాలకు నోచుకోక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో జాతర సమయంలో అమ్మవారి చెంతకు వచ్చిన మంత్రులు ఆలయ అభివృద్ధిపై హామీలు ఇచ్చినా ఆచరణకు నోచుకోలేదు. ప్రభుత్వం మారినా ఆలయం అభివృద్ధి ఊసేలేదు.

కనీస వసతులూ కరువే

మరో వారం రోజుల్లో జాతర ప్రారంభం కానున్నప్పటికీ ఏర్పాట్లు చెయ్యడంలో తీవ్ర జాప్యం జరుగుతున్నది. ప్రతి ఏటా అమ్మవారి ఆదాయం దాదాపు రూ.50లక్షల నుంచి రూ.70లక్షల వరకు ఉంటుంది. అయినా దేవాదాయశాఖ అధికారులు మాత్రం ఆలయ అభివృద్ధిని పట్టించుకోవడం లేదు. గుడి ఆవరణలో వసతులు లేక భక్తులకు ఏటా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూడు నెలల పాటు జరిగే ఈ ఉత్సవాలకు కనీసం తాత్కాలిక వసతులు కూడా కల్పించలేకపోవడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నీళ్ల వసతి, మరుగుదొడ్ల, మూత్రశాలలు సదుపాయాలు సరిగాలేవు. దీంతో జాతర సమయంలో భక్తులు ప్రైవేట్‌వారి దోపిడీకి గురవుతున్నారు.

పూర్తిస్థాయి పాలకమండలి లేక..

కొండపోచమ్మ ఆలయ పాలకవర్గం గత పదేళ్లుగా తాత్కాలిక కమిటీలతోనే కొనసాగుతుంది. రెగ్యులర్ పాలకవర్గం లేక ఆలయం అభివృద్ధి ముందుకు సాగడంలేదు.

ఉత్సవాల సమయంలో దేవాదాయశాఖ ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసి ఉత్సవాలను ముగిస్తున్నారు తప్ప అభివృద్ధిపై దృష్టి పెట్టడం లేదు. ఉత్సవ కమిటీ అయినా 14 మంది సభ్యులు ఉండాల్సింది. అయితే కొత్తగా పునరుద్ధరణ కమిటీని నలుగురు సభ్యులతో ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏడాది పాటు నలుగురు పాలకవర్గం సభ్యులుగా కొనసాగనున్నారు. దీంతో కమిటీ పరంగా ఎలాంటి పట్టు సాధించలేకపోతున్నారు. అధికారులు సిబ్బందిపై అజమాయిషీ కొరవడుతున్నది. కనీసం ఈసారైనా పూర్తి స్థాయి పాలకమండలిని ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

ఇవీ తక్షణావసరాలు..

కొండపోచమ్మ ఆలయం వద్ద మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణ పనులు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు. ముఖ్యంగా కొండపోచమ్మ జాతరకు వచ్చే భక్తులకు పార్కింగ్ సమస్య తీవ్రంగా ఉన్నది. హైదరాబాద్‌తో పాటు దూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. ఒక రోజు ఇక్కడే నిద్ర చేసి రెండోరోజు వెళ్లిపోవడం ఆనవాయితీ. రెండు రోజులు ఉండే భక్తులకు వాహనాలను నిలపడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు


ఘటనాస్థలంలో పడి ఉన్న క్షతగాత్రులు

ములుగు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని తునికిబొల్లారం రోడ్డులో సోమవారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ములుగు మండల పరిధిలోని బహిలింపూర్ గ్రామానికి చెందిన నీరుడి మల్లేష్, గువ్వ యాదగిరి తునికిబొల్లారం ఆర్ అండ్ ఆర్ కాలనీ నుంచి టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై బయలుదేరారు. ఈ క్రమంలో వంటిమామిడి వైపు నుంచి బొల్లారం వైపు వస్తున్న మరో ద్విచక్రవాహనం టీవీఎస్ఎక్సెల్‌ను అతివేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో నీరుడి మల్లేష్ కాలువ విరగగా. గువ్వ యాదగిరి తలకు తీవ్ర గాయమై రక్తస్రావం జరగడంతో వెంటనే అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానికులు వారి కుటుంబ సభ్యులకు సమాచారమందించారు. క్షతగాత్రులను వెంటనే సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు.


గ్యాంబ్లింగ్ స్థావరంపై పోలీసుల దాడి

గజ్వేల్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రజ్ఞాపూర్ గ్రామ శివారులో కొంతమంది వ్యక్తులు గ్యాంబ్లింగ్-తంబోలా ఆడుతున్నారని పోలీసులకు సమాచారమందింది. దీంతో సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు, గజ్వేల్ పోలీసులతో కలిసి నిర్వహించిన దాడిలో నలుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. వారి నుంచి రూ.12,980 నగదు, నాలుగు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదా తెలిపారు.

భారతీయ సైన్స్ టెక్నోఫెస్టివల్‌లో బేగంపేట టీచర్‌కు జాతీయస్థాయి బహుమతి

రాయపోల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): భారతీయ సైన్స్ టెక్నో ఫెస్టివల్‌లో రాయపోల్ మండలం బేగంపేట పాఠశాల ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు భాస్కర్‌రెడ్డికి మూడో బహుమతి వచ్చింది. ఈ నెల 11, 12 తేదీల్లో మధ్యప్రదేశ్‌లోని బుర్హాన్‌పూర్‌లోని మ్యాక్రో విజన్ అకాడమీలో రామన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫౌండేషన్, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ టీచర్ సైంటిస్ట్ ఇండియా, ఏపీజేకేవైఎస్ ఇండియా సంయుక్తంగా నిర్వహించిన 5వ భారతీయ సైన్స్ టెక్నో ఫెస్టివల్‌లో ఆయన పాల్గొని ఇన్నోవేటివ్ టీచింగ్ మెథడ్‌ను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనకు జాతీయస్థాయిలో 3వ బహుమతి లభించింది. ఈ మెగా సైన్స్ ఈవెంట్‌లో 18 రాష్ట్రాల నుంచి ఉపాధ్యాయులు పాల్గొన్నట్లు ఆయన వెల్లడించారు. జాతీయ స్థాయి బహుమతి పొందిన భాస్కర్‌రెడ్డిని పాఠశాల హెచ్‌ఎం అంజిరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

కనుల పండువగా కల్యాణోత్సవాలు


సిద్దిపేట వేంకటేశ్వరాలయంలో శ్రీగోదారంగనాథుల కల్యాణ వేడుకల్లో భక్తులు, రాయపోల్ మండలం అనాజీపూర్‌లో గోదా రంగనాథుల కల్యాణోత్సవం

సిద్దిపేట కల్చరల్/కొండపాక/రాయపోల్/చేర్యాల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు వైష్ణవాలయాల్లో సోమవారం శ్రీగోదాదేవి రంగనాయకుల కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోవింద నామస్మరణతో ఆయా ఆలయ ప్రాంగణాలు మార్మోగాయి. జిల్లా కేంద్రంలోని మోహినిపుర వేంకటేశ్వర ఆలయ ఆవరణలోని శ్రీనివాస ధ్యానమందిరంలో కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కొండపాక ఆనంద నిలయం ఆవరణలో గల కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో, దుద్దెడ వేణుగోపాల స్వామి ఆలయంలో గోదారంగనాయకుల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. రాయపోల్ మండలం అనాజీపూర్‌లో గోదా రంగనాథుల కల్యాణాన్ని పురోహితుడు నారాయణస్వామి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళ, బుధ వారాల్లో గ్రామంలోని వివిధ ఆలయాల చుట్టు బండ్ల ప్రదక్షిణ, జాతర నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. చేర్యాల పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో గోదారంగనాథుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు.

మర్పడగలో ఆర్ద్ర మహోత్సవం

కొండపాక, జనవరి 13: మండలంలోని మర్పడగ విజయదుర్గ సమేత సంతాన మల్లికార్జున క్షేత్రంలో సోమవారం ఆర్ద్ర మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రంలో మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, నీరాజనసేవ నిర్వహించారు.

సముద్రాలలో వీరభద్రుడి కల్యాణం

కోహెడ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సముద్రాల గ్రామంలోని శ్రీ భద్రకాళీ సహిత వీరభద్ర స్వామి కల్యాణోత్సవం సోమవారం కనుల పండువగా నిర్వహించారు. స్వామి వారికి ఆలయ కమిటీ అధ్యక్షుడు దున్నపోతుల పరశురాములు పట్టు వస్త్రాలను తీసుకురాగా, కరీంనగర్‌కు చెందిన గౌరిశెట్టి సత్యనారాయణ పుస్తె, మట్టెలను అందజేశారు.. అనంతరం పండితులు ముత్యాల తలంబ్రాలు, వేద మంత్రాల మధ్య వీరభద్రస్వామి కల్యాణం నిర్వహించారు. మూడురోజులపాటు జరిగే ఈ జాతరలో భోగి పండుగనాడు కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయంలో వాహన పూజ, బండ్లతో ఊరేగింపు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.


శ్రీ భద్రకాళి సహిత వీరభద్రస్వామి కల్యాణంలో భక్తులు

చట్టబద్ధంగా ప్రశ్నిస్తే కేసులా?

● జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి




చేర్యాల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పార్టీ ఫిరాయించిన విషయమై చట్టబద్ధంగా ప్రశ్నించిన హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై అక్రమంగా కేసులు బనాయించి ప్రభుత్వం అరెస్ట్ చేయడం శోచనీయమని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అరెస్టను ఖండిస్తూ సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాపాలన పేరిట కాంగ్రెస్ దొంగనాటకమాడుతుందని, నిజాలను నిగ్గుతేల్చే ప్రజాగొంతుకలను సహించలేక ప్రశ్నించే ప్రతిపక్షనేతల హక్కులను కాలరాస్తుందన్నారు. బీఆర్ఎస్‌లో గెలిచి కాంగ్రెస్‌లో చేరినందుకు ఏ పార్టీనుంచి మాట్లాడుతున్నావని ఎమ్మెల్యే సంజయ్‌ను ప్రశ్నించినందుకే కౌశిక్‌రెడ్డిపై 3కేసులు బనాయించడం అప్రజాస్వామికమన్నారు. సీఎం రేవంత్ పరిపాలనలో నిర్బంధాలు, ఆంక్షలు నిత్యకృత్యమయ్యాయని, ఎన్ని అక్రమ కేసులు బనాయించినా బీఆర్ఎస్ భయపడ బోదని, ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటామని హెచ్చరించారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మోపిన కేసుల విషయంలో అసెంబ్లీ స్పీకర్ చొరవ వహించి న్యాయపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కౌశిక్‌రెడ్డిని వెంటనే బేషరతుగా విడిచిపెట్టాలని డిమాండ్ చేశారు.

కైట్ ఫెస్టివల్‌ను ప్రారంభించిన నర్సారెడ్డి


కైట్ ఫెస్టివల్‌ను ప్రారంభిస్తున్న డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి

గజ్వేల్, జనవరి 13(ఆంధ్ర జ్యోతి): సంస్కృతి, సంప్రదాయాలకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన కైట్ ఫెస్టివల్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మడుపు భూంరెడ్డి, ఆయా మండలాల పార్టీ బాధ్యులు శ్రీనివాస్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, శ్రీనివాస్, కిష్టాగౌడ్, రవీందర్ రెడ్డి, గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, నాయకులు, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ వైస్ చైర్మన్ ఆంక్షారెడ్డి, జంగం రమేశ్‌గౌడ్, సారిక శ్రీనివాస్ రెడ్డి, వెంకట్రాం రెడ్డి, శివులు, అంజాగౌడ్, డప్పు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని చక్కబెడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి


వీరన్నపేటలో సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి

చేర్యాల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ హయాంలో అప్పుల కుప్పగా విధ్వంసమైన తెలంగాణ రాష్ట్రాన్ని సీఎం రేవంత్‌రెడ్డి కార్యదక్షతతో అన్నిరంగాలలో చక్కబెడుతూ ప్రజాసంక్షేమానికి పాటుపడుతున్నారని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. చేర్యాల మండలం వీరన్నపేట గ్రామంలో చేపట్టనున్న సీసీరోడ్డు నిర్మాణం పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ పదేళ్ల పాటు బీఆర్ఎస్ నేతలు రాష్ట్రాన్ని దోచుకున్నారన్నారు. జనగామ నియోజకవర్గ అభివృద్ధికి చిత్తశుద్ధితో పాటుపడుతున్నానన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు కొండపాక భిక్షపతి, నాయకులు మంజె మల్లేశం, ఆరెళ్ల పాపయ్య, బుడిగశ్రీనివాస్, సురేశ్‌రెడ్డి, ఎల్లయ్య, విద్యాసాగర్,రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం


అంబేడ్కర్ జాతీయరత్న అవార్డును పొందిన శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీకమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

మిరుదొడ్డి,జనవరి13(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో ఎక్కడైనా దళితులపై దాడులు జరిగితే బాధితులకు అండగా ఉంటామని రాష్ట్రఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. సోమవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలకేంద్రంలోని ఆయన నివాసంలో డీబీఎఫ్ ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో అంబేడ్కర్ అవార్డు పొందిన గుర్రాల శ్రీనివాస్, సేవారత్న అవార్డు పొందిన కుంబాల రవి, కార్మిక అవార్డు పొందిన యాదగిరిలను ఆయన శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దళితుల అభ్యున్నతికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్, బీఆర్ఎస్ నాయకులు తోట కమలాకర్‌రెడ్డి, మల్లయ్య, ర్యాకం శ్రీరాములు, జీడిపల్లి రవి, సుకూరి లింగం, పోలీస్‌రాజులు, బుచ్చయ్య, కిషన్, సిద్దిరాములు, పరశురాములు, కుమార్, రాజమల్లయ్య, పెద్దముత్యం తదితరులున్నారు.

పద్యకవి వెంకట్‌కు సాహిత్య సదస్సు పురస్కారం


పురస్కారం అందుకుంటున్న పద్యకవి వెంకట్

చేర్యాల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మండలం ఐనాపూర్ గ్రామానికి చెందిన పద్య కవి, సంస్కృతోపన్యాసకులు బి.వెంకట్ తెలంగాణ సాహిత్య సదస్సు పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా సంక్రాంతిని పురస్కరించుకుని దోమకొండ ఫోర్ట్ అండ్ విలేజ్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కామారెడ్డి దోమకొండకోట సంస్థానంలో సాహిత్య సమాలోచన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన దోమకొండచరిత్రపై ఉపన్యసించి స్వీయ పద్యపఠనంతో ప్రతిభ కనబరిచారు. అనంతరం నిర్వాహకులు బాబ్జి జ్వాలాది తదితర కవులు పురస్కారాన్ని అందించి సత్కరించారు.

అక్రమంగా రోడ్డువేయడం సరికాదు

● మిరుదొడ్డి మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు రాజులు

మిరుదొడ్డి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌పార్టీ అధికారంలో ఉన్నమంటూ కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారని మిరుదొడ్డి మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు రాజులు విమర్శించారు. సోమవారం మిరుదొడ్డి మండలం అల్వాల్ గ్రామంలోని తన పట్టాభూమి 76,77 సర్వేనంబరులో గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు అక్రమంగా రోడ్డును వేశారని మండిపడ్డారు. తన సొంత పొలం నుంచిరోడ్డును వేయడంపై రాజులు తీవ్రంగా ఖండించారు. ఇదే విషయంపై జిల్లా కలెక్టర్‌కు, దుబ్బాక సీఐకి, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు. ఆయన వెంట మిరుదొడ్డి మండల మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బాల్‌రాజు, హైమ్మద్, గ్రామస్థులు తదితరులున్నారు.

చైనా మాంజా విక్రయిస్తే కఠినచర్యలు


సిద్దిపేటలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

సిద్దిపేట క్రైం/గజ్వేల్/కోహెడ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజా అమ్మితే కఠిన చర్యలు తప్పవని జిల్లాలోని పోలీసు అధికారులు హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం జిల్లాలోని వివిధ మండలాల్లో వెలసిన పతంగుల దుకాణాలను తనిఖీ చేసి పలువురిపై కేసులు నమోదు చేశారు. సిద్దిపేట పట్టణంలో వన్‌టౌన్ సీఐ వాసుదేవరావు ఆధ్వర్యంలో పోలీసులు పలు పతంగుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... చైనా మాంజాలు మనుషులతో పాటు ఎగిరే పక్షులకు, ద్విచక్రవాహనదారులకు తీవ్ర ప్రమాదం పొంచిఉందని వివరించారు. ఎవరైన చైనా మాంజా వినియోగిస్తున్నా వెంటనే వన్ టౌన్ పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. గజ్వేల్ పట్టణంతో పాటు నియోజకవర్గంలోని పతంగుల దుకాణాల్లో గజ్వేల్ రేంజ్ అటవీ అధికారి వినాయక్ ఆధ్వర్యంలో అటవీశాఖ సిబ్బంది ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అటవీ అధికారి వినాయక్ మాట్లాడుతూ.. పలు దుకాణాల్లోని చైనా మాంజాను స్వాధీనం చేసుకుని, కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా అక్రమంగా చైనామాంజాను విక్రయిస్తే చట్ట ప్రకారం జైలు శిక్ష, జరిమానా తప్పదని హెచ్చరించారు. కోహెడ మండలంలో చైనా మాంజా అమ్మితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ అభిలాష్ హెచ్చరించారు. కోహెడలో గాలిపటాల దుకాణాల్లో ఆయన తనిఖీ చేశారు.

ఉజ్జయినిలో మహా రుద్రయాగం



మహా రుద్రయాగం నిర్వహిస్తున్న తెలంగాణ వేద పండితులు

జగదేవ్‌పూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని అమ్మవారి ఆలయంలో మహారుద్రయాగం సోమవారం ప్రారంభమైంది. లోక కల్యాణార్థం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 50 మంది వేద పండితుల ఆధ్వర్యంలో ఉజ్జయినిలో మహా రుద్రయాగం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. మర్కుక్ మండల భవానందపూర్ గ్రామంలోని పాండురంగ ఆశ్రమం ఆధ్వర్యంలో ఏటా ఓ పుణ్యక్షేత్రంలో మహా రుద్రయాగం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఈ సంవత్సరం ఉజ్జయినిలో నిర్వహిస్తున్నారు. సోమవారం ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, రుత్విక్‌హోవనము, కలశస్థాపన, మహన్యాస రుద్రాభిషేకం కార్యక్రమాలను నిర్వహించారు.

దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం


అప్పనపల్లిలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాక, జనవరి13: దుబ్బాక నియోజక వర్గ అభివృద్ధికి తాను అహర్నిషలు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజక వర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం దుబ్బాక మండలం గంబీర్‌పూర్, ఆకారం, పెద్దగుండవెల్లి, బల్వంతాపూర్, అప్పనపల్లి గ్రామాల్లో ఎన్‌ఆర్‌జీఏ కింద రూ. 10 లక్షల చొప్పున మంజూరు అయిన సీసీ రోడ్లకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ... దుబ్బాకను అన్ని విధాలుగా తీర్చిదిద్దడానికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు గడీల జనార్దన్‌రెడ్డి, కొంగరిరవి, ఉషయ్యగారి రాజిరెడ్డి, సద్ధిరాజిరెడ్డి, అనంతుల శ్రీనివాస్, పాతూరి వెంకటిగౌడ్, శ్రీనివాస్, భరత్, తదితరులున్నారు.

నంగునూరులో ఎమ్మార్పీఎస్ ర్యాలీ

నంగునూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : వచ్చే నెల 7న హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జరుప తలపెట్టిన వెయ్యి గొంతుకలు లక్ష డప్పుల సమీకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం నంగునూరులో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రంగదాం భాను, ఎమ్మెస్‌ఎఫ్ మండల అధ్యక్షుడు బాలరాజుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నంగునూరులో ఎమ్మార్పీఎస్ నాయకులు డబ్బు చప్పులతో ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. సుదీర్ఘ పోరాటాల ద్వారా సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇస్తే, ఆ తీర్పును కొంతమంది మేధావులు వ్యతిరేకిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా వర్గీకరణను అడ్డుపడకుండా సహకరించాలన్నారు. ఎంతమంది అడ్డుపడ్డ వర్గీకరణ ఆగదన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఆరెపల్లి కనకయ్య, దేవులపల్లి నర్సింగారావు,రాజు, పాపిగారి నరేష్, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు

రోడ్డు భద్రతా నియమాలను
ప్రతి ఒక్కరూ పాటించాలి

గజ్వేల్/చిన్నకోడూరు/మద్దూరు/కొండపాక/చేర్యాల, జనవరి 13(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లావ్యాప్తంగా పోలీసులు ట్రాఫిక్ నియమనిబంధనలపై, రోడ్డు భద్రతా నియమాలపై ప్రజలకు, డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ క్రమంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని పాతూర్ మార్కెట్ వద్ద గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళీ ఆధ్వర్యంలో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ట్రిబుల్ రైడింగ్ చేయవద్దని, మైనర్‌లకు డ్రైవింగ్ కోసం వాహనాలను ఇవ్వొద్దని సూచించారు. వాహనానికి సంబంధించిన అన్ని డాక్యుమెంట్లను వెంట ఉంచుకోవాలని ట్రాఫిక్ సీఐ అవగాహన కల్పించారు. చిన్నకోడూరు మండల కేంద్రంతో పాటు రామునిపట్ల గ్రామంలో ఎస్‌ఐ బాలకృష్ణ ఆధ్వర్యంలో వాహనదారులకు, యువకులకు, రోడ్డు, ట్రాఫిక్ నిబంధనల గురించి అవగాహన కల్పించారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మద్దూరు మండలంలోని గాగిళ్లాపూర్‌లో ఎస్‌ఐ షేక్ మహబూబ్ ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. మద్యం తాగి వాహనాలను నడపవద్దని సూచించారు. కొండపాక మండలంలోని రాజీవ్ రహదారి సమీపంలోని దుద్దెడ గ్రామంలో తీ టౌన్ సీఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో వాహనదారులకు, గ్రామస్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రతీ వాహనదారుడు నిబంధనలను పాటించాలని సూచించారు. ట్రిబుల్ రైడింగ్ చేయవద్దని, మైనర్ డ్రైవింగ్ ప్రమాదకరమన్నారు. చేర్యాలలో సీఐ ఎల్ శ్రీను ఆధ్వర్యంలో ఆటోడ్రైవర్లు, వాహనదారులతో ర్యాలీ నిర్వహించారు.